సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామ రక్ష

- ఏ పార్టీతో తమకు పోటీ లేదు, అభివృద్ధి, సంక్షేమంతోనే పోటీ
- ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఒక్క బీఆర్ఎస్ పార్టీ నాయకులకే ఉంది
- నియోజకవర్గ స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి

ముసారం బాగ్ డివిజన్ పార్టీ కార్యాలయంలో మలక్‌పేట నియోజకవర్గ స్థాయి సమావేశంలో డివిజన్ల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, కమిటీల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి

మలక్‌పేట, అక్టోబర్ 10: ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామ రక్ష అని బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. ముసారం బాగ్ డివిజన్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ముసారం బాగ్, పాత మలక్‌పేట, అక్బర్‌బాగ్, సైదాబాద్, చావునీ అజంపురా డివిజన్ల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, కమిటీల సభ్యులతో మంగళవారం సమావేశం జరిగింది. సమావేశంలో డివిజన్ నేతలు, నాయకుల సలహాలు, సూచనలు స్వీకరించిన ఆయన, ఎన్నికల్లో అనురించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఒక్క బీఆర్ఎస్ పార్టీ నాయకులకే ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు మించి హామీ ఇవ్వని అనేక పనులు చేశారని, దేశంలో ఏ రాష్ట్రంలోని లేనన్ని సంక్షేమ పథకాలను అమలు పరిచి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచారని అన్నారు. రాష్ట్రంలో కుల, మతాలకతీతంగా ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. సంక్షేమ ఫలాలు పొందిన ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌ను ఆదరిస్తారని, ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడగాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన పేర్కొన్నారు. కలిసికట్టుగా పని చేస్తే విజయం మనదేనని అన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మరోసారి డివిజన్ స్థాయి నాయకులతో సమావేశాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ముందుగా మనందరికీ ఆత్మవిశ్వాసం ముఖ్యమని, ఏ పార్టీతో తమకు పోటీ లేదని, అభివృద్ధి, సంక్షేమంతోనే తమకు పోటీ అని అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్‌ను ప్రజలు తప్పక ఆదరిస్తారనే నమ్మకం తనకు ఉందన్నారు. సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు హద్దులు పెట్టుకోకుండా అన్ని డివిజన్లలో జరిగే ప్రచార కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని సూచించారు. ఫ్రెండ్లీ అనే అంశాన్ని పక్కనబెట్టి పోటీ చేస్తున్నామన్న అంశాన్ని పరిగణనలోకి ముందుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరిని కలిసి ఓటు వేయాలని అడగాలని, ఇంటింటికీ ప్రచారం నిర్వహించాలని సూచించారు. కలిసికట్టుగా పనిచేస్తే విజయం మనదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు తీగల సునరితారెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఆర్.రాజేశ్వర్‌రెడ్డి, బట్టు దాసు రావు, నక్క అమరేందర్ గౌడ్, గుండవరం వేణుగోపాల్ రావు, బాబు సుదర్శన్, టిల్లూ సింగ్, ముసారం బాగ్, పాత మలక్‌పేట, అక్బర్‌బాగ్, సైదాబాద్, చావునీ, అజంపురా డివిజన్ల అధ్యక్షులు అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి, కామేశ్, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, హబీబ్, మారుతి, నాయకులు తేళ్ల మహేష్ కుమార్, శ్రీధర్‌రెడ్డి, నవీన్ యాదవ్, ధర్మేందర్, గోపాల్, మోహన్ రాజ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితా నాయక్, మాజీ చైర్‌పర్సన్ రాధ, వైస్ చైర్మన్ భూమేశ్వర్, డైరెక్టర్లు అభిషేకం, రాహుల్, నరేశ్, రాము యాదవ్, యాదగిరి, సల్మాన్ మహ్మద్ ఖాన్, ఎజాజ్, మాజీ డైరెక్టర్లు నూలి శ్రీధర్ రావు, రవీందర్ రెడ్డి, జయసుధ, పారమ్మ, లలితా, తిరు నగరి రాధ, శశిధర్ రావు, నాగరాజు, సుమన్, దానకర్ణాచారి, గోపాల్, సాగర్, వసీం, ప్రసాద్, బీఎన్‌రాజు, పగిళ్ల నర్సింగ్, సదానంద్, సునీత్ పత్తి, శ్రీధర్‌రావు, అనిల్, లాయక్ అలీ పాల్గొన్నారు.

ఎన్‌జీఆర్ఐ సైంటిస్టుకు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఫెలోషిప్

- ఎంపికైన డాక్టర్ ప్రతీక్ మండల్,
- సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మాణిక్యాంబకు జీఎస్ఐ ఉమెన్ సైంటిస్ట్ అవార్డు

సిటీబ్యూరో, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ): ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఫెలోషిప్‌నకు ఎన్‌జీఆర్ఐ పరిశోధకులు ఎంపికయ్యారు. భూకంప అధ్యయనాల్లో జాతీయ స్థాయిలో సమగ్రమైన నెట్‌వర్క్ స్థాపించడంలో కీలక పాత్రను పోషిస్తున్న చీఫ్ సైంటిస్ట్ డా.ప్రతీక్ మండల్ ఫెలోగా నిలిచారు. దేశ వ్యాప్తంగా సెస్మిక్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడంతో పాటు 55 బ్రాడ్‌బ్యాండ్ సెస్మోగ్రాఫ్, 20 స్ట్రాంగ్ మోషన్ యాక్సిల్లరి గ్రాఫ్ అమలు చేయడంలో మండల్ ముఖ్య భూమికను పోషించారు. హిమాలయాలతో పాటు దేశంలోని అన్ని పీఠభూమి ప్రాంతాల్లో సంభవించి ప్రకంపనాలు, భూకంపాలను కచ్చితత్వంతో కొలిచే విధానాలను అమలు చేయడంలో చేశారు. ఉత్తరాఖండ్, గుజరాత్, హిమాలయ పర్వత ప్రాంతాల్లో భూకంపాల చేసిన అధ్యయనాలకు గాను ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఫెలోకు ఎంపికైనట్లుగా ఎన్జీఆర్ఐ వర్గాలు వెల్లడించాయి. అదే విధంగా ఎన్‌జీఆర్ఐలో సైంటిస్టుగా సేవలు అందిస్తున్న డా. సి.మాణిక్యాంబ జియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా-2023 ఉమెన్ సైంటిస్టు అవార్డుకు ఎంపిక చేసింది. భారత పర్వత, కొండ ప్రాంతాల్లో జియోకెమికల్ స్టడీస్‌పై ఆమె పరిశోధనలు చేస్తున్నారు.

సీసీఎంబీలో ఐదు రోజుల వర్క్‌షాప్

సిటీబ్యూరో, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయోలాజీలో 'డీఎన్ఏ విశ్లేషణ, జంతు జాలం వృద్ధి' అనే అంశంపై ఐదు రోజుల వర్క్‌షాప్‌ను పరిశోధకులు ప్రారంభించారు. ప్రపంచ బ్యాంక్ సహకారంతో ఐసీఏఆర్ ఎన్ఏహెచ్ఈపీ, వెటర్నటీ కాలేజీ నిపుణులు, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సదస్సులో యానిమల్ ఫుడ్ సేఫ్టీ, డిసీజ్ వంటి అంశాలతో పాటు, జంతు మూలాలను పరిరక్షణలో ఈ వర్క్ షాప్ సాయపడుతుందని సీసీఎంబీ వర్గాలు వెల్లడించాయి. అరుదైన, అంతరించిపోతున్న వన్యప్రాణుల డీఎన్ఏ బ్యాంక్ ఉంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న పశు, మత్స్య సంవర్ధక శాఖతో అటవీ శాఖకు చెందిన పరిశోధకులు, నిపుణులు సీసీఎంబీ డీఎన్ఏ ప్రాముఖ్యతను విశ్లేషిస్తూ ప్రత్యేక వర్క్ షాప్‌లను నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు.

ఫ్రెంచ్ స్పేస్ కంపెనీలతో స్కైరూట్ ఒప్పందం



ఫ్రెంచ్ కంపెనీలతో ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్న స్కైరూట్ ప్రతినిధులు

సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన ఏరోస్పేస్ స్టార్టప్ కంపెనీ స్కైరూట్ ఫ్రాన్స్ దేశానికి చెందిన స్పేస్ కంపెనీలతో ఒప్పందాన్ని మంగళవారం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా స్కైరూట్ సీఈఓ, సహ వ్యవస్థాపకులు పవన్ చందన మాట్లాడుతూ, ఇండియా-ఫ్రాన్స్ దేశాల మధ్య అంతరిక్ష రంగంలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆదేశానికి చెందిన ఎక్స్‌ప్లియో, కనెక్ట్ శాట్‌లతో స్కైరూట్ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. తాము త్వరలో ప్రయోగించే విక్రమ్ -1 రాకెట్‌కు సంబంధించిన అంశాలపై కలిసి పనిచేస్తామని తెలిపారు.

పండుగకు 620 ప్రత్యేక రైళ్లు

జూబ్లీహిల్స్,అక్టోబర్10 : దసరా, దీపావళి పండుగలకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే 620 ప్రత్యేక రైళ్లను నడిపించనుంది. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలోని సికింద్రాబాద్‌తో పాటు 6 డివిజన్‌లలో ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని సీపీఆర్ఓ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రారంభించిన ఈ రైళ్లు అక్టోబర్ 31 వరకు ఆయా రూట్లలో ప్రయాణికులకు సేవలందించనున్నట్లు పేర్కొన్నారు.

17 నుంచి రైల్వే కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు ఈ నెల 17, 19 తేదీల్లో జరుగుతాయని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఎన్‌వీఎన్ చౌదరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదలచేశారు. హైదరాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణానికి విచ్చేసిన ఆయన ఈ నెల 17న సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయంలో, ఈ నెల 19న సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని ఇతర ప్రాంతాలకు సొసైటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. విధి నిర్వహణలో ఉంటూ వివిధ ప్రాంతాలకు ఆయా రైళ్లలో దూర ప్రాంతాలకు వెళ్లే కార్మికులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీరి కోసం ఈ నెల 11 నుంచి 18 వరకు సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయంలో, 16 నుంచి 18 వరకు ఇతర ప్రాంతాల రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు జరుగుతాయన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 10: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ సూచించారు. సిటిజన్ యూత్ పార్లమెంట్ ముగింపు కార్యక్రమం ఉస్మానియా యూనివర్సిటీలోని పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ఎంతో విలువైనదని అన్నారు. ఇక్కడ ఉన్న విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని చెప్పారు. వీరిలో భవిష్యత్తు పార్లమెంటేరియన్లు సైతం ఉన్నారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో యువత పాత్ర ఎంతో ఉన్నదని గుర్తు చేశారు. హైదరాబాద్ రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం జరిగిందని అన్నారు. ఇరవై ఐదేళ్ల కంటే తక్కువ వయసున్న యువకుల ఆత్మహత్యలపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో యువత శక్తి చాలా ఎక్కువని చెప్పారు. వివేకానంద ప్రసంగాలతో యువత ప్రేరణ చెందుతారని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ తమ దేశానికి ఏం చేయగలరో ఆలోచించుకోవాలని సూచించారు. ఓటములను కూడా ఆస్వాదించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఉత్తమమైన సంస్కృతి గల దేశం మనదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, సీనియర్ జర్నలిస్టు వల్లీశ్వర్, ఓయూ అధికారులు పాల్గొన్నారు. 130 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన 17 మందిని ఎంపిక చేసి, వారిని జాతీయ స్థాయిలో జరిగే యూత్ పార్లమెంట్‌కు పంపించనున్నారు. ఎంపికైన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఖతర్‌లో మలక్‌పేట వాసి మృతి

అభినవ్ (ఫైల్)

సైదాబాద్, అక్టోబర్ 10: జీవనోపాధి కోసం ఖతర్ దేశానికి వెళ్లిన ఓ సివిల్ ఇంజినీర్ అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం మరణించాడు. మలక్‌పేటలో అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని సుశృత కాలనీకి చెందిన మారం అభినవ్ (42) సివిల్ ఇంజినీర్. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కొన్నేండ్ల క్రితం కుటుంబంతో సహా జీవనోపాధి కోసం ఖతర్‌కు వెళ్లి అక్కడ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం అక్కడ కారులో ప్రయాణిస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అభినవ్ తీవ్రంగా గాయపడ్డారు. దవాఖానలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం భౌతికకాయం నగరానికి వస్తుందని, అనంతరం అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగనున్నాయని సోదరుడు మారం జ్ఞానేశ్వర్ తెలిపారు. అభినవ్ మరణ వార్త తెలియడంతో స్థానికంగా విషాదం అలుముకున్నది.

పెద్ద చెరువు విచారణకు జీహెచ్ఎంసీ కమిషనర్

జూబ్లీహిల్స్,అక్టోబర్10: రామంతాపూర్ పెద్ద చెరువుతో పాటు ఇతర చెరువులకు కంచె వేసి వాటి రక్షణకు చర్యలు తీసుకోవడం లేదన్న వ్యాజ్య విచారణకు జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌తో పాటు రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు వ్యక్తిగతంగా హాజరయ్యారు. చెరువు పరిరక్షణతో పాటు ఏం చర్యలు తీసుకున్నారని పురపాలక శాఖను హై కోర్టు ఆదేశించింది. హైదరాబాద్ మహానగరంలో నిరాదరణకు గురవుతూ 532 చెరువులు, 200 తోటలు క్షీణిస్తున్నాయని.. ప్రధానంగా 25 ఎకరాల్లోని రామంతాపూర్ పెద్ద చెరువును డంపింగ్ యార్డుగా మార్చివేస్తున్నారని 2005లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కె.ఎల్. వ్యాస్ రాసిన లేఖను హై కోర్టు వ్యాజ్యంగా పరిగణించి విచారణకు స్వీకరించింది. ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. గత నెల 13న ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై జీహెచ్ఎంసీ కమిషనర్ వివరణ ఇవ్వాలని ఆదేశాలివ్వడంతో కమిషనర్ రొనాల్డ్ రాస్ వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామంతాపూర్ చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. స్థానిక తాసీల్దార్ 2016లో ఎఫ్‌టీఎల్‌ను గుర్తించి సంబంధిత రెవెన్యూ అధికారులకు పంపారని, ఇందుకు అనుగుణంగా హెచ్ఎండీఏ నోటిఫికేషన్ విడుదల చేయనుందని వివరించారు. తదనుగుణంగా చెరువులో పూడికతీత చర్యలు చేపట్టి.. నిల్వ సామర్థ్యం పెంపునకు మొక్కల పెంపకం వంటి పనులు చేపడతామన్నారు. చెరువు వద్ద చెత్తను తొలగించి తాజా పరిస్థితిపై ఫొటోలతో కలిపి నివేదికను సమర్పించాలని.. ఆదేశించిన హై కోర్టు తదుపరి విచారణను ఈనెల 12 కు వాయిదా వేసింది. తదుపరి విచారణకు కూడా జీహెచ్ఎంసీ కమిషనర్ హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది.

తిరోగమనంలో రుతుపవనాలు..

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..

జూబ్లీహిల్స్, అక్టోబర్ 10: నైరుతి రుతుపవనాలు తిరోగమన దిశలో వెళ్తుండడంతో వర్షాలు పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టాయి. వాయువ్య దిశ నుంచి కింది స్థాయి గాలులు తెలంగాణ వైపునకు వీస్తుండడంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21.2 డిగ్రీల సెల్సియస్‌గా.. గాలిలో తేమ 51 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాగల మరో రెండు.. మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.